ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112    www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03    సంచిక -112    పేజీలు - 04    వెల - 04/-    శనివారం 9 మే 2026

# పోలీస్ అధికారి భార్య హత్య

**జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో దారుణం**

**విశ్రాంత పోలీస్ అధికారి వినయ్ రంజన్ సతీమణి హత్య**

**ఇంటి పనిమనిషి కల్పనే సూత్రధారి**



**హైదరాబాద్ మే 8ఆంధ్ర ప్రగతి**

జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో దారుణ హత్య జరిగింది. విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనూజ (55) హత్యకు గురయ్యారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి నివాసంలో పని చేస్తున్న నేపాల్‌కు చెందిన పని మనిషి కల్పన ఈ హత్యలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. పోలీసుల అనుమానం ప్రకారం, కల్పన మరో ముగ్గురితో కలిసి ముందస్తు ప్రణాళికతో హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. **మిగతాది 2లో...**

# వీడని సస్పెన్స్!

## కొత్త ప్రభుత్వ ఏర్పాటులో తొలగని అనిశ్చితి..

**అనేక నాటకీయ పరిణామాలు**

**గవర్నర్ అర్లీకర్‌తో విజయ్ సమావేశం..**

**120 మంది బలాన్ని చూపెట్టిన దళపతి**

**విసికె నుండి లేఖ అందలేదని అభ్యంతరం**

**నేడు విజయ్ ప్రమాణ స్వీకారంపై సందిగ్ధం**

**మద్దతు ప్రకటించిన వామపక్షాలు**

**ప్రభుత్వంలో చేరబోమని ప్రకటన**



**చెన్నై మే 8ఆంధ్ర ప్రగతి**

తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్ వీడటం లేదు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలకు అనేక రూపాల్లో అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు తమను **మిగతాది 2లో...**

# ఆలస్యమైతే ఆటో అప్రూవల్!

## ఏపీలో వాహన రిజిస్ట్రేషన్ ఇక 24 గంటల్లోనే..

**రిజిస్ట్రేషన్ల జాప్యంపై చంద్రబాబు ఆదేశాలతో కొత్త విధానం**

**ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 27 వేల రిజిస్ట్రేషన్లు**

**త్వరలో ప్రభుత్వ ఆమోదంతో అమల్లోకి రానున్న కొత్త రూల్**



# కిడ్నీ రోగులకు అండగా ప్రభుత్వం

**రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు**

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**అమరావతి, మే 8ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో కిడ్నీ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం రాజధాని అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రైవేట్ ఏజెన్సీకి టెండర్ ద్వారా వీటి నిర్వహణ చేపడతాయని తెలిపారు. ఇప్పటికే కూటమి పాలనలో 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. అదనపు డయాలసిస్ **మిగతాది 2లో...**



# దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి

**కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా**

**430 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన**

**మహలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం**

**కొండంగల్‌లో పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపనలు**

**కొడంగల్ మే 8ఆంధ్ర ప్రగతి**


దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా



మారుస్తామని ఉద్ఘాటించారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. 430 పడకల ఆస్పత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయటం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఓవైపు గుడి.. మరోవైపు గడి ఏకమైన ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చటానికి అందరు కలిసి రావటం**మిగతాది 2లో...**

# ఫైళ్ల క్లియరెన్స్ వేగం పెంచాలి




## రెండోరోజు కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు కీలక సూచనలు

**గవర్నెన్స్‌లో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ ముఖ్యం**

**ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకోవడం సరికాదు**

**సిఎస్ నుంచి మండలస్థాయి వరకు ఫైళ్ల క్లియరెన్స్ వేగం పెంచాలి**

**ఆన్‌లైన్ ఫైలింగ్ అన్నది పూర్తిగా అందుబాటులోకి రావాలి**

**మాన్యువల్ ఫైలింగ్ విధానం తుడిచిపెట్టుకు పోవాలి**

**టెక్నాలజీతో పోటీపడి ముందుకు సాగాలి**

**అమరావతి మే 8ఆంధ్ర ప్రగతి**

స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌లో ఫైళ్ల క్లియరెన్స్ అనేది అతి ముఖ్యమైన అంశమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సీఎస్, సెక్రటరీలు, హెచ్‌వోడీలు మొదలుకొని.. మండల స్థాయి వరకు ఫైళ్ల క్లియరెన్సుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. రు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందిస్తూ.. ఆన్‌లైన్ సేవలను పూర్తిగా అందుబాటులోకి తెస్తే ప్రజల సమయం వృధా కాదని తెలిపారు. టెక్నాలజీ ఇంటిగ్రేషన్ జరిగితే పాలన సులభతరం అవుతుందని సూచించారు. వాట్సాప్ గవర్నెన్సు మనమిత్ర ద్వారా పౌరసేవలపై ప్రజలకు శిక్షణ ఇస్తున్నామని సీఎం తెలిపారు**మిగతాది 2లో...**




# బెంగాల్ రాజకీయాల్లో బిజెపి శకం

**రాష్ట్ర సిఎంగా సువేందు అధికారి -శాసనసభాపక్ష నేతగా ఏకగ్రవీంగా ఎన్నిక**

**అమిత్ షా సమక్షంలో ఎమ్మెల్యేల భేటీ -నేడు సిఎంగా సువేందు ప్రమాణ కార్యక్రమం**

**ప్రధాని మోడీ, అమిత్ షా, తదితర దిగ్గజాల హాజరు**



**కోల్‌కతా మే 8ఆంధ్ర ప్రగతి**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి పగ్గాలు చేపట్టనున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో సువేందు అధికారిని శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఉదయం 11:00 గంటలకు కోల్‌కతాలోని చరిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో **మిగతాది 2లో...**

# దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి

(మొదటి పేజి తరువాయి)

అభినందనీయమని తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు సుందరవరదాచార్యులు కలలుగన్న గుడి నిర్మాణం సహకారం కావటం సంతోషమని చెప్పారు. తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్‌కు దేశంలో గుర్తింపు వస్తోందని తెలిపారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నరలోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు. కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.కృష్ణ- వికారాబాద్ రైల్వేలైన్ త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు. రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు. 20 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యాహబ్‌గా మార్చుతున్నామని సీఎం ఉద్ఘాటించారు. ఇక్కడ అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలని.. ఆ తర్వాత అందరం కలిసి పనిచేయాలని సూచించారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టాలని.. అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కొడంగల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# పోలీస్ అధికారి భార్య హత్య

(మొదటి పేజి తరువాయి)

తనూజ ఒంటరిగా ఉన్న విషయాన్ని తన గ్యాంగ్‌కు చెప్పిన కల్పన గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వారితో కలిసి హత్యకు పాల్పడినట్లు సమాచారం. హత్య అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, నగదు తీసుకుని నిందితులు పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు. కాగా, 8 నెలలుగా ఆ ఇంట్లో కల్పన పని చేస్తోంది. మరోవైపు ఘటనాస్థలికి ఉన్నతాధికారులు చేరుకుని పరిశీలించారు. కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నివాస ప్రాంతంలో హత్య జరగడం సంచలనంగా మారింది. హత్య విషయం తెలిసిన వెంటనే రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఇంటికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేరుకున్నారు. కాగా, వినయ్ రంజన్ రాయ్ ప్రస్తుతం బెంగళూరులో ఉన్నట్లు తెలుస్తోంది.

-------------

# కిడ్నీ రోగులకు అండగా ప్రభుత్వం

(మొదటి పేజి తరువాయి)

కేంద్రాలతో కలిపి మొత్తం 73 కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్నవారికి అందుబాటులోకి వచ్చాయని మంత్రి సత్యకుమార్ వివరించారు. 'ప్రైమ్ మినిస్టర్ నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం' కింద రాష్ట్రంలోని సెకండరీ ఆసుపత్రుల్లో 61 కేంద్రాలు నడుస్తున్నాయని వివరించారు. వీటికి అదనంగా ఈ 12 కేంద్రాలు వస్తున్నాయని తెలిపారు. కొత్త కేంద్రాల రాకతో దూర ప్రాంతాలకు వెళ్లి రక్త శుద్ధి చేయించుకునే రోగులకు అవస్థలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమని తెలిపారు. ఈ కేంద్రాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఐదేళ్లకు కలిపి సుమారు రూ.30 కోట్ల వరకు ఖర్చు చేస్తుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ వివరించారు. ఇక ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2,721పైగా డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 985 మిషన్లు, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,736 డయాలసిస్ మిషన్లు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 21,504 మంది కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నారు.

# ఉన్నత విద్యకు వెళ్లే వారికి అండ

## పావలా వడ్డీకే రుణాలు అందించేలా చర్యలు

## కెలక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి మే 8ఆంధ్ర ప్రగతి**

దేశ విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లే విద్యార్థులకు పావలా వడ్డీకే విద్య రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్లను సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించడమే లక్ష్యమని అన్నారు. చాలామంది రుణాలు అందక చదువుకలేక పోతున్నారని, అలాంటి వారికి అండగా నిలవాల్సి ఉందన్నారు. శుక్రవారం రాజధాని అమరావతిలో జిల్లా కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలతోపాటు తల్లికి వందనం, సంక్షేమంపై అధికారులకు సీఎం చంద్రబాబు సూచనలు చేశారు. అలాగే పథకాల అమలు, లబ్దిదారుల ఇంటిగ్రేషన్‌పై వారికి సీఎం దిశానిర్దేశర చేశారు. అన్నదాత సుఖీభవ, దీపం 2.0, స్త్రీ శక్తి, దివ్యాంగశక్తి పథకాలపై చర్చించారు. దీపం-2.0 పథకం కింద 1.08 కోట్ల మంది లబ్దిదారులు ఉన్నారని తెలిపారు. దీపం-2.0 పథకానికి ఇప్పటి వరకు రూ.3,504 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. స్త్రీ శక్తి కోసం ఏడాదికి రూ.1,940 కోట్ల ఖర్చు అవుతుందని చెప్పారు. తల్లికి వందనం కింద 67 లక్షల మందికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఏజెన్సీల్లో కాఫీ, పసుపు, కుంకుమపువ్వు సాగుకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు ప్రకటించారు. అరకు కాఫీకి గ్లోబల్ బ్రాండ్ తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. జిల్లా కలెక్టర్‌ల సమావేశం గురువారం రాజధాని అమరావతిలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశం సాయంత్రం ముగిసింది.

# ఆలస్యమైతే ఆటో అప్రూవల్!

## ఏపీలో వాహన రిజిస్ట్రేషన్ ఇక 24 గంటల్లోనే..

### రిజిస్ట్రేషన్ల జాప్యంపై చంద్రబాబు ఆదేశాలతో కొత్త విధానం

### ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 27 వేల రిజిస్ట్రేషన్లు

### త్వరలో ప్రభుత్వ ఆమోదంతో అమల్లోకి రానున్న కొత్త రూల్

**అమరావతి,మే 8ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై కేవలం 24 గంటల్లోనే శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికానుంది. ఈ మేరకు రవాణా శాఖ రూపొందించిన కొత్త విధానానికి ఈ వారంలోనే ప్రభుత్వం ఆమోదం తెలిపే అవకాశం ఉంది.వాహనాల రిజిస్ట్రేషన్‌లో జరుగుతున్న జాప్యంపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో రవాణా శాఖ ఈ కొత్త విధానాన్ని ప్రతిపాదించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 27 వేల వాహనాలు శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం పెండింగ్‌లో ఉన్నాయి.కొత్త విధానం ప్రకారం డీలర్ తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన 24 గంటల్లోపు రవాణా శాఖ అధికారులు శాశ్వత రిజిస్ట్రేషన్‌ను ఆమోదించాలి. ఫ్యాన్సీ నంబర్లు కోరుకునే వారికి ఈ నిబంధన వర్తించదు. ఒకవేళ అధికారులు గడువులోగా ఆమోదం తెలపడంలో విఫలమైతే సిస్టమ్ ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్‌కు ఆమోదం తెలుపుతుంది. సెలవు రోజుల్లో కూడా అధికారులు ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు.తొలుత శాశ్వత రిజిస్ట్రేషన్ అధికారాన్ని డీలర్లకే అప్పగించాలని సీఎం సూచించినప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రావొచ్చని అధికారులు వివరించారు. దీంతో రిజిస్ట్రేషన్ అధికారాన్ని రవాణా శాఖ వద్దే ఉంచి, 24 గంటల కాలపరిమితితో కూడిన విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ దస్త్రం ప్రభుత్వ ఆమోదం పొందగానే కొత్త విధానం అమల్లోకి రానుంది.

# ఫైళ్ల క్లియరెన్స్ వేగం పెంచాలి

(మొదటి పేజి తరువాయి)

. మాన్యువల్ ఫైళ్లనేవి దాదాపు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెండో రోజు కలెక్టర్ల సదస్సులో ఫైళ్లక్లియరెన్స్, అవేర్, డేటా లేక్ అంశాలపై సీఎం సమీక్షించారు. ఫైళ్లను త్వరగా క్లియర్ చేస్తే ప్రభుత్వ సేవలు మరింత త్వరగా అందుతాయని సీఎం అన్నారు. పాలనకు టెక్నాలజీ అనుసంధానించడంతోపాటు... హ్యూమన్ టచ్ కూడా ముఖ్యమని వ్యాఖ్యానించారు. 24 గంటల్లోపు ఈ-ఫైల్స్ డిస్పోజ్ చేసేలా మంత్రులు, అధికారులు శ్రద్ధ పెట్టాలని తెలిపారు. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో అందరి పనితీరును ఎప్పటికప్పుడు నమోదు చేస్తూనే ఉన్నామని వెల్లడించారు. జిల్లాల్లో ఇ-ఆఫీస్ ద్వారా లేని ఫైల్స్ ఎన్ని ఉన్నాయో గుర్తించాలని సూచించారు. జిల్లా స్థాయిలో హెచ్‌ఓడీలు తప్పనిసరిగా ఈ-ఫైల్స్ మాత్రమే జనరేట్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు సేవలందించే విషయంలో, మరింత మెరుగైన పాలనకు కలెక్టర్లు వినూత్నంగా ఆలోచించాలన్నారు. క్లియరెన్స్ రోజుల వ్యవధి నుంచి గంటల వ్యవధిలోకి రావడంపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. క్లియరెన్స్‌లో వేగంగా ఉన్న మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు, సెక్రటరీలను సీఎం అభినందించారు. పెద్దమొత్తంలో ఫైళ్ల వచ్చినా సరాసరి 10 గంటల వ్యవధిలో డిస్పోజ్ చేసిన సీఎస్ సాయి ప్రసాద్‌కు సీఎం అభినందనలు తెలిపారు. అవేర్ సహా వాట్సాప్ గవర్నెన్సు వినియోగంపై కలెక్టర్లకు సీఎం సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలు, ప్రొసీజర్స్ సులభతరం కావాలన్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఉంటే ఎంత టైమ్ వృధా అవుతుందో ఆలోచించాలని అన్నారు. ఇప్పటికే 29 లక్షల మందికి ట్రైనింగ్ ఇచ్చామని.. 90 శాతం ప్రభుత్వ సేవలు వాట్సాప్‌లో అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. డిసెంబర్ నాటికి అన్ని సేవలను వాట్సాప్‌లో అందించేలా చూడాలని ఆదేశించారు. మాన్యువల్ టచ్ పాయింట్ల వద్దకు వచ్చే ప్రజలకు వాట్సాప్ వినియోగాన్ని వివరించాలన్నారు. స్మార్ట్ ఫోన్లు లేని కుటుంబాలు 34 శాతంగా ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ సేవల ద్వారా అవినీతితో పాటు దుర్వినియోగం కూడా తగ్గుతుందని చెప్పుకొచ్చారు. అవేర్ 2.0 నుంచి వచ్చే సమాచారాన్ని ఇంటిగ్రేట్ చేసుకుంటూ నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. పిడుగుల హెచ్చరికలను జారీ చేయటంలో ఇంకా పర్ఫెక్షన్ రావాలన్నారు. తుఫాన్ల హెచ్చరికల సమయంలో నేరుగా మొబైళ్లకే మెసేజ్‌లు పంపించాలని తెలిపారు. తుఫాన్ల హెచ్చరికలను స్వర్ణ గ్రామ, వార్డుల ద్వారా కూడా పంపించాలని అన్నారు. సీవీడ్ సాగుపై తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు దృష్టి సారించాలని సూచించారు. అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల్లో అక్రమ కట్టడాలపై దృష్టి సారించాలన్నారు. మున్సిపాలిటీలు, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు చేశారు. అవేర్ సహా వాట్సాప్ గవర్నెన్సు వినియోగంపై కలెక్టర్లకు సీఎం సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలు, ప్రొసీజర్స్ సులభతరం కావాలన్నారు. ఆన్‌లైన్ సేవలను పూర్తిగా అందుబాటులోకి తెస్తే ప్రజల సమయం వృధా కాదని తెలిపారు. టెక్నాలజీ ఇంటిగ్రేషన్ జరిగితే పాలన సులభతరం అవుతుందని సూచించారు.

మాన్యువల్ టచ్ పాయింట్ల వద్దకు వచ్చే ప్రజలకు వాట్సాప్ వినియోగాన్ని వివరించాలన్నారు. స్మార్ట్ ఫోన్లు లేని కుటుంబాలు 34 శాతంగా ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ సేవల ద్వారా అవినీతితో పాటు దుర్వినియోగం కూడా తగ్గుతుందని చెప్పుకొచ్చారు. అవేర్ 2.0 నుంచి వచ్చే సమాచారాన్ని ఇంటిగ్రేట్ చేసుకుంటూ నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు.అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల్లో అక్రమ కట్టడాలపై దృష్టి సారించాలన్నారు. మున్సిపాలిటీలు, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు చేశారు.

# బెంగాల్ రాజకీయాల్లో బిజెపి శకం

(మొదటి పేజి తరువాయి)

ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నేతలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. పాలనలో సమతుల్యత కోసం ఇద్దరు ఉపముఖ్యమంత్రులను నియమించాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఒక డిప్యూటీ సీఎం పదవిని మహిళా నేత బహుశా అగ్నిమిత్ర పాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. ప్రాంతీయ సమీకరణలు దృష్టిలో పెట్టుకుని ఉత్తర బెంగాల్, గిరిజన ప్రాంతాలకు కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమచారం.తమిళనాడులో విజయ్ లాగే సువేందు అధికారి కూడా ఈ ఎన్నికల్లో రెండు చోట్ల భవానీపూర్, నందిగ్రామ్ పోటీ చేసి రెండింటిలోనూ ఘనవిజయం సాధించారు. ముఖ్యంగా భవానీపూర్‌లో మమతా బెనర్జీపై 15,000 పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచి 'జెయింట్ కిల్లర్'గా నిలిచారు. 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది. టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఉదయం జరగనున్న ఈ కార్యక్రమం ద్వారా బెంగాల్ గడ్డపై కమల దళం అధికారికంగా పాలనను ప్రారంభించనుంది. సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపుర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు. సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీలో చేరారు. సువేందు 2006-09 మధ్య రాజకీయాల్లో బాగా ఎదిగారు. 2006లో తొలిసారి కొంటాయి (దక్షిణ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఏడాది కొంటాయి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గానూ బాధ్యతలు చేపట్టి.. మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు. సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమానిది ప్రత్యేక పాత్ర. నందిగ్రామ్‌లో 10 వేల ఎకరాలు సమీకరించి సెజ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని అప్పటి వామపక్ష ప్రభుత్వం భావించింది. దానికి వ్యతిరేకంగా తృణమూల్ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టింది. వాటిని సువేందు ముందుండి నడిపించారు. నందిగ్రామ్ ఉద్యమం విజయవంతం కావడంతో.. జంగల్ మహల్ (పశ్చిమ మేదినీపుర్, పురూలియా, బాంకురా జిల్లాలు) ప్రాంతానికి తృణమూల్ ఇంఛార్జిగా సువేందును మమత నియమించారు. మమతకు అత్యంత సన్నిహిత నేతల్లో ఒకరిగా ఎదిగారు. సువేందు 2009లో తమ్లుక్ స్థానం లోక్‌సభ ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2016లో నందిగ్రామ్ ఎమ్మెల్యేగా విజయం సాధించి.. మమత సర్కారులో మంత్రి పదవి చేపట్టారు. తృణమూల్ వ్యవస్థాపక సభ్యుడైన ముకుల్ రాయ్ 2017లో పార్టీని వీడారు. అప్పటి నుంచి తృణమూల్‌లో సువేందు ప్రభావం మరింత పెరిగింది. పార్టీలో మమత తర్వాత నంబర్-2 ఈయనేనని అంతా అనుకున్నారు. అయితే క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. మమత తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి పార్టీలో అధిక ప్రాధాన్యమివ్వడం, ఆయనకే పార్టీ పగ్గాలు అప్పగించేలా కనిపించడం సువేందుకు రుచించలేదు. అప్పటికే శారదా కుంభకోణంలో ఆరోపణలు రావడంతో కొంత ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో 2020 చివర్లో అనూహ్యంగా తృణమూల్‌ను వీడి భాజపాలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగిన సువేందు.. మమతను ఓడించారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో భవానీపుర్‌లో మమతను మరోసారి ఓడించి, ఇప్పుడు ఏకంగా బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు.

# వీడని సస్పెన్స్!

(మొదటి పేజి తరువాయి)

ఆహ్వానించాలంటూ ఇప్పటికే రెండు సార్లు గవర్నర్‌ను కలిసిన విజయ్‌కు.. లోక్‌భవన్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. ఇక శుక్రవారం సాయంత్రం టీవీకే అధినేత మూడోసారి గవర్నర్‌ను కలిశారు. తమకు 120 మంది సభ్యుల బలం ఉందని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు సమాచారం. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్.. విజయ్‌ని ఆహ్వానించారని వార్తలు వచ్చాయి. అలాగే సీఎంగా విజయ్ శనివారం ఉదయం 11 గంటలకు ప్రమాణస్వీకారం చేస్తారని కూడా విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే కొత్త ప్రభుత్వ ఏర్పాటు విషయంలో గవర్నర్ కార్యాలయం నుంచి మాత్రం ఎలాంటి ప్రకటనా వెలువడకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చినట్టయ్యింది. విజయ్ టీవీకేకు అప్పటి వరకు మద్దతు ప్రకటించిన వీసీకే, ఐయూఎంఎల్‌ల తీరుతో ఈ ప్రతిష్టంభన నెలకొంది. వీసీకే అధికారికంగా మద్దతు లేఖను అందించలేదు. మధ్యాహ్నం వరకు.. టీవీకేకు మద్దతు ఇస్తామని ప్రకటించిన ఐయూఎంఎల్ సాయంత్రం వరకు తన మద్దతను ఉపసంహరించుకుంది. ఈ మేరకు ఐయూఎంఎల్ ఒక ప్రకటనను సైతం విడుదల చేసింది. ఫలితగా టీవీకే బలం 116కు పడిపోయినట్టయ్యింది. అయితే ఈ కారణంగానే గవర్నర్ కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదని తెలుస్తోంది. దీంతో తమిళ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

**టీవీకేకు మద్దతు లేఖ మెయిల్ చేసిన వీసీకే**

అనిశ్చిత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వీసీకే.. టీవీకేకు ఈమెయిల్ ద్వారా మద్దతు లేఖను పంపింది. ఈ విషయాన్ని వీసీకే ట్వీట్ ద్వరా తెలియజేసింది. కాగా వీసీకే, ఐయూఎంఎల్‌లకు ఇద్దరు చొప్పున ఎమ్మెల్యేలు ఉన్నారు.

**విజయ్ ప్రమాణస్వీకారంపై అనిశ్చితి**

శుక్రవారం సాయంత్రం మారిన పరిస్థితుల నడుమ సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారంపై మేఘాలు కమ్ముకున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు విజయ్ ప్రమాణస్వీకారం చేస్తారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే ఇప్పటికీ విజయ్ టీవీకే పార్టీ మెజారిటీ మార్కుకు రెండు స్థానాల దూరంలో ఉండటంతో ప్రభుత్వ ఏర్పాటుకు ఆటంకం ఏర్పడిందని రాజకీయ పరిశీలకులు వివరిస్తున్నారు.

**ఫలితాలు వెలువడినప్పటి నుంచి రాజకీయ అనిశ్చితి**

ఈనెల 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి తమిళనాడులో రాజకీయ అనిశ్చితి కొనసాగుతోంది. మొత్తం 234 స్థానాలు కలిగి ఉన్న తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటు కోసం మ్యాజిక్ ఫిగర్ 118 స్థానాలను దక్కించుకోవాలి. అయితే ఫలితాల్లో ఏ ఒక్క పార్టీ కూడా మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోలేక పోయింది. విజయ్ టీవీకే 108 స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించి.. మ్యాజిక్ ఫిగర్‌కు 10 స్థానాల దూరంలో ఆగిపోయింది. డీఎంకే 59, ఏఐఏడీఎంకే 47 స్థానాలకు పరిమితమయ్యాయి. ఇక కాంగ్రెస్ ఐదు స్థానాలు, పీఎంకే నాలుగు, సీపీఐ(ఎం), సీపీఐ, ఐయూఎంఎల్, వీసీకే లు రెండు స్థానాల చొప్పున, బీజేపీ, డీఎండీకే, అమ్మ మక్కల్ మున్నేట్ర కజగంలు ఒక్క సీటు చొప్పున గెలుచుకున్నాయి.

**గవర్నర్‌ను ఇప్పటికే రెండు సార్లు కలిసిన విజయ్**

ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అతిపెద్ద పార్టీగా ఉన్న టీవీకే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అంతా భావించారు. కానీ ఇందుకు లోక్‌భవన్ బ్రేకులు వేసింది. ప్రభుత్వ ఏర్పాటుకు తమకు అవకాశమివ్వాలంటూ టీవీకే అధినేత విజయ్ ఇప్పటికే బుధ, గురు వారాల్లో రెండు సార్లు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌ను కలిశారు. కానీ స్పష్టమైన మెజారిటీ 118 స్థానాలు లేవనే కారణంతో గవర్నర్ రెండు సార్లు కూడా విజయ్ ప్రతిపాదనను తిరస్కరించారు.

**డీఎంకే-అన్నాడీఎంకే కూటమి ప్రభుత్వంపై ఊహాగానాలు**

ఒకానొక సమయంలో తమిళనాడులో బద్ధ శత్రువులైన డీఎంకే, అన్నాడీఎంకేలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలున్నాయని కూడా వార్తలు వచ్చాయి. బీజేపీని దూరం పెడితే తాము బయటి నుంచి అన్నాడీఎంకేకు మద్దతు తెలుపుతామని కొందరు డీఎంకే నేతలు కూడా ప్రతిపాదించినట్టు కథనాలు వెలువడ్డాయి. ఈ కూటమి ఏర్పాటుపై అంతర్గతంగా చర్చలు జరుగుతున్నట్టు కూడా వార్తలు గుప్పుమన్నాయి. అయితే ఈ వార్తలను డీఎంకే తోసిపుచ్చింది.

విజయ్‌కి మద్దతు తెలుపుతున్న పార్టీలు

విజయ్ టీవీకేకు కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, వీసీకేకు మద్దతు తెలిపాయి. మొదటగా మద్దతు తెలిపిన పార్టీ కాంగ్రెస్. ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ పార్టీ టీవీకేకు మద్దతు తెలపడంతో బలం 113కు చేరింది. తాజాగా మిగిలిన పార్టీలు కూడా సపోర్ట్ ఇవ్వడంతో అది మ్యాజిక్ ఫిగర్‌ను చేరినట్టయ్యింది. డీఎంకేతో పొత్తుతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు టీవీకే పార్టీకి మద్దతు ఇస్తోంది. కాగా కొత్తగా ఏర్పడనున్న విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో మద్దతు ఇస్తున్న పార్టీలకు కూడా క్యాబినెట్ బెర్తులు దక్కనున్నట్టు తెలుస్తోంది. ఇందులో వామపక్షాలకు రెండు, వీసికేకు ఒక స్థానం దక్కనున్నట్టు వార్తలు వస్తున్నాయి.

**బయటనుంచే మద్దతు : వామపక్షాలు**

చెన్నైలో సంయుక్త పత్రికా సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండ్యన్ మాట్లాడుతూ టీవీకేకు మద్దతునివ్వాలని నిర్ణయించినట్టు ప్రకటించారు. టీవీకే మంత్రివర్గంలో తాము చేరబోవడం లేదని తెలిపారు. బయటనుంచే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సంక్షోభ నివారణకు, గవర్నర్‌ను అడ్డుపెట్టుకొని బీజేపీ ఆడుతున్న నాటకానికి తెరదించడానికే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. మతోన్మాద శక్తులను వ్యతిరేకిస్తూ, తమిళనాడు హక్కులను పరిరక్షిస్తూ సాగించే పోరాటాల్లో డీఎంకేతో కలిసి తాము ముందుకు సాగుతామని అన్నారు.

**కృతజ్ఞతలు తెలిపిన విజయ్**

వామపక్షాలు మద్దతు ప్రకటించిన వెంటనే విజయ్ సీపీఐ(ఎం), సీపీఐ కార్యాలయాలకు వెళ్లి ఆయా పార్టీల నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సవాళ్లతో కూడిన ఇటువంటి పరిస్థితుల్లో మద్దతు తెలియజేసినందుకు చాలా కృతజ్ఞుడిని అంటూ విజయ్ తెలిపారని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కె.బాలకృష్ణన్ చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మతోన్మాద శక్తులను అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారన్నారు. తమిళనాడులో సుస్థిరమైన, లౌకిక, ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటు కోసమే టీవీకేకు మద్దతునిచ్చామని సీపీఐ తెలియజేసింది.

# మహానంది క్షేత్రంలో నవగ్రహ మండపం దగ్గర

# బలవంతపు వసూళ్లు..!

## -అధికారుల మౌనం వెనుక మతలబు ఏమిటి.?

**.. భక్తుల నుంచి బలవంతపు వసూలు చేయడంతో విశ్వహిందూ పరిషత్ నాయకులు కిషోర్ ఆగ్రహం.**







**ఆంధ్ర ప్రగతి మహానంది మే 08:**
నంద్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో భక్తుల పట్ల ప్రైవేటు వ్యక్తులు, కాంట్రాక్టర్లు ప్రవర్తిస్తున్న తీరు అత్యంత విచారకరమని విశ్వహిందూ పరిషత్ నాయకులు కిషోర్ తీవ్రంగా ధ్వజమెత్తారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే సామాన్య భక్తులను అడ్డగోలుగా దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు.
నవగ్రహ దర్శనం పేరిట నిర్బంధం మహానందీశ్వర స్వామి దర్శనం ముగించుకుని బయటకు వచ్చే భక్తులను బలవంతంగా నవగ్రహ దర్శనానికి వెళ్లాలని కాంట్రాక్టర్లు హుకుం జారీ చేయడం అన్యాయం. భక్తులకు ఇష్టం ఉన్నా లేకపోయినా, వారిని నిర్బంధంగా పంపిస్తూ దీపాలతో నవగ్రహ సేవ అంటూ ఒక్కొక్కరి వద్ద 50 నుండి 100 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు.
టెండర్ల సాకుతో దౌర్జన్యం: ఈ దోపిడీపై ప్రశ్నించిన భక్తులకు, "మేము 65 లక్షలకు టెండర్ వేసుకున్నాము, కాబట్టి ప్రతి భక్తుడు ఇక్కడ దీపాలు వెలిగించి డబ్బులు కట్టాల్సిందే" అని కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం వారి అహంకారానికి నిదర్శనం.
రాష్ట్రంలోనే ప్రముఖ దైవ క్షేత్రాలు ఒకటైన మహానందిశ్వర స్వామి దేవస్థానం ఆలయ పరిసరాల్లో ఇంతటి బహిరంగ దోపిడీ జరుగుతున్నా, దేవస్థానం అధికారులు కళ్లున్నా కబోదుల్లా వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏమిటి.? ప్రజల బహిరంగంగా చర్చించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం పని చేయాల్సిన దేవస్థానం బోర్డు, కాంట్రాక్టర్ల లాభాల కోసం పని చేస్తోందా.? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మహానంది క్షేత్రం యొక్క పవిత్రతను కాపాడాలని, భక్తులపై జరుగుతున్న ఈ బలవంతపు వసూళ్లను వెంటనే అరికట్టాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేస్తోంది. కాంట్రాక్టర్ల ఆగడాలపై విచారణ జరిపి, భక్తులకు స్వేచ్ఛాయుతమైన దర్శనం కల్పించకపోతే భవిష్యత్తులో విహెచ్‌పి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. తక్షణమే దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మరియు దేవస్థానం కార్య నిర్వహణ అధికారి నల్ల కాలువ శ్రీనివాసరెడ్డి ఈ విషయంపై జోక్యం చేసుకొని మహానందిశ్వర స్వామి దేవస్థానంలోని నవగ్రహ మండపం లోని నవగ్రహ దీపాల కాంట్రాక్ట్ ను రద్దు చేసి దేవస్థానం పై ప్రజలకు నమ్మకాన్ని మరియు మంచి దర్శనాన్ని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## నంద్యాల రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం

**- ..రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనన్ట్ కి ఘన నివాళులు.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 08:**
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ నందు ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం మరియు తలస్మియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందని రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు

ఈ కార్యక్రమంలో భాగంగా రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనన్ట్ కి ఘన నివాళులు అర్పించి, రెడ్ క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ప్రథమ వార్షికోత్సవ వేడుక లో భాగంగా కేక్ కట్ చేసి, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లి పిల్లల వార్డులో అందరికీ పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ ఎం ఓ ఇన్చార్జి సూపర్డెంట్ డాక్టర్ రఫీక్, ప్రముఖ వ్యాపారవేత్త గోళ్ళ సుదర్శనం, రెడ్ క్రాస్ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద్ గురూజీ, రెడ్ క్రాస్ ట్రెజరర్ నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాష, రెడ్ క్రాస్ మహిళ నాయకురాలు వసుందర దేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా దస్తగిరి పర్ల మాట్లాడుతూ.. మానవత్వం ఏకమవుదాం అని నినాదంతో ఈ సంవత్సరం రెడ్ క్రాస్ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని అందులో భాగంగా రెడ్ క్రాస్ సేవలు కోసం లక్ష రూపాయలు విరాళం అందజేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త గొల్ల సుదర్శన్ ని ఘనంగా సన్మానించడం జరిగిందని అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళలకు పిల్లలకు పండ్లు,బెడ్లు పంపించడం జరిగింది అన్నారు
సుదర్శన్ గారు మాట్లాడుతూ రెడ్ క్రాస్ కార్యక్రమాలకు భవిష్యత్తులో తన వంతుగా ఇంకా సహకరిస్తానని అన్నారు
హాస్పిటల్ ఇన్చార్జి సూపర్డెంట్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ వారు తక్కువ ధరకే నాణ్యమైన మందులు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేయడమే కాకుండా ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా తల్లి పిల్లల వార్డులో ప్రతి ఒక్కరికి పనిలో బ్రేడ్లు పంపించడం చాలా సంతోషకరమన్నారు.

## నందమూరి నగర్ లో రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు.

..ఇబ్బంది పడుతున్న వాహనదారులు వార్డు ప్రజలు.
..పట్టించుకోని మున్సిపల్ అధికారులు.
..పరిశీలించిన నందమూరి నగర్ సిపిఐ శాఖ సభ్యులు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ మే 08:**


సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ హాజరై మాట్లాడుతూ.. నందమూరి నగర్ లోని మొదటి నీళ్ల ట్యాంకు ఎదురుగా ఉస్మానియా గని మసీదుకు పోయే రహదారిలో ఒకవైపు డ్రైనేజీ సగం వరకు వేసి నిలుపుదల చేయడం వలన ఆ మురికి నీరు మొత్తం రోడ్డుపైకి రావడం జరుగుతుంది. అక్కడ నివసించేవారు దోమలతో ఆ వాసనతో బాధపడుతున్నారు వాహనదారులు పాదచారులు మసీదుకుపోయేవారు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆ ప్రాంత సచివాలయ ఉద్యోగి మున్సిపల్ సిబ్బంది ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు మునిసిపల్ అధికారులు వెంటనే ఆ డ్రైనేజీని పూర్తి చేసి కాలువ పై ఉన్న వాటిని తొలగించి పూడిక తీసి శుభ్రం చేయకపోతే భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఆ ప్రాంత వాసులను కలుపుకొని మున్సిపల్ కార్యాలయంను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎందుకంటే మున్సిపాలిటీకి అక్కడివారు అనేక రకాల పన్నులు చెల్లిస్తున్నారు వారి సమస్యలు పట్టించుకోకపోతే తిరగ బడతారని అన్నారు.ఈ కార్యక్రమంలో నందమూరి నగర్ సిపిఐ శాఖా కార్యదర్శి ఎస్ హుస్సేన్నా నాయకులు సలాం ఖాన్ ఇస్మాయిల్ బాబు సద్దాం తదితరులు పాల్గొన్నారు

## భీరవోలులో మహిళ హత్య కేసు ఛేదించిన పోలీసులు.

**భార్యను హత్య చేసి బావిలో పడేసిన భర్త.**
**..మృతదేహాన్ని పూడ్చిపెట్టిన ఇద్దరు సహోదరులు.**
**ముగ్గురు నిందితులు అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు.**



**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె, మే 07:**
మండలంలోని భీరవోలు గ్రామంలో సంచలనం సృష్టించిన మహిళ మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు. భార్య ఆదిలక్ష్మిని హత్య చేసి మృతదేహాన్ని బావిలో పడేసిన భర్త వెంకటస్వామితో పాటు, మృతదేహాన్ని పూడ్చిపెట్టడంలో సహకరించిన అతని సోదరులు వెంకటరమణ, శ్రీనివాసులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.
పట్టణంలోని రూరల్ సీఐ సర్కిల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు.సీఐ తెలిపిన వివరాల మేరకు.. భీరవోలు గ్రామానికి చెందిన వెంకటస్వామి తన భార్య ఆదిలక్ష్మి తరచూ ఫోన్‌లో ఇతరులతో మాట్లాడుతోందనే అనుమానంతో ఆమెను ద్విచక్ర వాహనంపై ఊరికి వెళ్దాం అంటూ తీసుకెళ్లాడు. అనంతరం భీరవోలు జీఎన్ఎస్ఎస్ కాలువ సమీపంలో ఆమెపై దాడి చేసి దారుణంగా హత్య చేసినట్లు తెలిపారు.హత్య అనంతరం మృతదేహానికి రాళ్లు కట్టి సమీపంలోని బావిలో పడేశాడు. అయితే రెండు రోజుల తర్వాత బావి వద్దకు వెళ్లి చూడగా మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. దీంతో తన సోదరులు వెంకటరమణ, శ్రీనివాసుల సహాయంతో శవాన్ని బయటకు తీసి, సమీపంలోని కాలువ ప్రాంతంలో ఎవరికీ అనుమానం రాకుండా భూమిలో పూడ్చిపెట్టినట్లు పోలీసులు వెల్లడించారు.
ఈ నెల 2వ తేదీన ఆదిలక్ష్మి కనిపించడం లేదని ఆమె తల్లి రాజోలి సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో భార్యపై అనుమానంతో వెంకటస్వామి హత్య చేసినట్లు బయటపడింది.
పోలీసులు అనుమానితుల కదలికలపై నిఘా పెట్టగా, పోలీసులకు చిక్కిపోతామనే భయంతో వెంకటస్వామి, వెంకటరమణ, శ్రీనివాసులు ముగ్గురు పోలీసులకు లొంగిపోయారు. హత్యకు ఉపయోగించిన మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు.విచారణలో నేరాన్ని అంగీకరించడంతో ముగ్గురినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నందివర్గం ఎస్ఐ భూపాలుడు హెడ్ కానిస్టేబుల్ గంగన్న మరియు పోలీసు సిబ్బంది సుబ్బరాయుడు రాజశేఖర్ మదన గోపాల్ చెన్నయ్య లు పాల్గొన్నారు.

## సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా వై. నాగశేషు నియామకం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 08:**


నంద్యాల జిల్లా, నంద్యాల సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ప్రముఖ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిరివెళ్ల మండలం గంగవరం గ్రామంనకు చెందిన వై.నాగ శేషు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం 11:30 గంటల సమయం నందు నంద్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్.డి.ఓ) మరియు సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ సి. విశ్వనాథ్ సార్ గారి చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా వై.నాగశేషు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సబ్ డివిజన్ పరిధిలోని పౌర హక్కుల పరిరక్షణకు, ప్రభుత్వ నిబంధనల మేరకు ఉల్లంఘించకుండా క్రమశిక్షణతో అమలు చేయుటకై అధికారుల సూచనల మేరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సేవలందిస్తున్న వై నాగశేషు కమిటీ సభ్యునిగా ఎంపిక కావడం పట్ల పలు ప్రజాసంఘాలు బీసీ విద్యార్థి సంఘాలు, వివిధ దళిత సంఘాలు మిత్రులు , ఆత్మీయులు మరియు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రభుత్వ సేవలను చివరి మైలు వరకు చేరవేస్తున్నాం.

**"మన మిత్ర" సేవలపై గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు.**

**..సర్వీస్ రిక్వెస్ట్‌ల సంఖ్య గణనీయంగా పెరిగింది.**

**..నంద్యాల జిల్లాకు కీలక పోస్టుల భర్తీ కోరిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 08:**
ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తూ, చివరి మైలు వరకు సమర్థవంతంగా అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నివేదించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలోని 5వ బ్లాక్‌లో ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో కలెక్టర్ జిల్లాలో అమలవుతున్న పలు కార్యక్రమాల పురోగతిని వివరించారు.ప్రస్తుతం "స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు" కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. "మన మిత్ర" ద్వారా అందిస్తున్న సేవలపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ చర్యల వల్ల చిన్నచిన్న పనుల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గి, గ్రామ స్థాయిలోనే సేవలు పొందుతున్నారని వివరించారు. సేవల వినియోగం పెరగడంతో సర్వీస్ రిక్వెస్ట్‌ల సంఖ్య కూడా గణనీయంగా



పెరిగిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలను ఆధునిక సౌకర్యాలతో, క్రమబద్ధతతో మరియు పరిశుభ్రతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. పాత విధానాలకు బదులుగా సాంకేతికత ఆధారిత పరిపాలనను మరింత బలోపేతం చేయాలన్నారు.నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ఐఆర్‌యూపీ ప్రాజెక్టులు అమలులో ఉన్నప్పటికీ, నెడ్క్యాప్ పీడీ పోస్టులు లేకపోవడం వల్ల భూముల అప్పగింత ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ రాజకుమారి సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ కోసం అనంతపురం పీడీ కార్యాలయంపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. అదేవిధంగా పర్యాటక ప్రాధాన్యత కలిగిన నంద్యాల జిల్లాలో డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్ పోస్టు లేకపోవడం వల్ల పరిపాలనా ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. కొత్త జిల్లాల్లో కీలక పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, ఇవి అత్యంత కీలకమైన పోస్టులని అంగీకరిస్తూ, ఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. బనగానపల్లెలో గృహ నిర్మాణాలకు సంబంధించిన లేఅవుట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, ఇందుకు సీసీఎల్ఏ అనుమతులు అవసరమని కలెక్టర్ వివరించారు. అలాగే "హౌసింగ్ ఫర్ ఆల్" పోర్టల్‌లో పాత లబ్ధిదారుల వివరాలు కొనసాగుతుండటంతో కొత్త దరఖాస్తుల సమయంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. గతంలో కేటాయించిన కొన్ని ఇళ్ల స్థలాలకు సంబంధించి కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండటంతో పట్టాల పంపిణీ ఆలస్యమవుతోందని పేర్కొన్నారు. అదేవిధంగా 2014-19 మధ్య మంజూరైన ఎన్టీఆర్ హౌసింగ్ పథకానికి సంబంధించిన బిల్లులు కూడా పెద్ద ఎత్తున పెండింగ్‌లో ఉన్నాయని సీఎం దృష్టికి కలెక్టర్ తీసుకువచ్చారు.ఈ సమస్యలపై స్పందించిన ముఖ్యమంత్రి, గృహ నిర్మాణాలకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులు, అవసరాలు మరియు సమస్యలను సమగ్రంగా వివరించి సీసీఎల్ఏకు ఈ-ఫైల్ పంపించాలని అధికారులను ఆదేశించారు. ఫైల్ అందిన వెంటనే తగిన ఆదేశాలు జారీ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఎరువుల దుకాణం ఆకస్మికంగా తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి ప్రసాదరావు.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 08:**
వ తేదీ న మండల వ్యవసాయ అధికారి, నంద్యాల ప్రసాద రావు నంద్యాల మండలం లో గల పలు ఎరువులు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. తనిఖీలో భాగంగా దుకాణాల యందు స్టాక్ రిజిస్టర్ ,బిల్ బుక్స్, రసీదులను,దుకాణం లోని నిలువలను పరిశీలించడం జరిగింది. ఆలాగే యూరియా నిల్వలను, రోజువారీ అమ్మకాలను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా దుకాణా లలో సరైన ధ్రువపత్రాలు సమర్పించనందున సుమారు 13 లక్షల విలువ గల 83 మెట్రిక్ టన్నుల ఎరువులు తాత్కాలికంగా అమ్మకపు నిలుపుదల చేయడం జరిగింది. అదేవిధంగా వ్యవసాయ పంటలు లేని సమయంలో యూరియా ఎరువులు అధికంగా అమ్మిన 5 దుకాణాల లైసెన్స్ లను 10 నుంచి 15 రోజుల పాటు సస్పెండ్ చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ యూరియా వివరాలను ప్రతీ రోజు వ్యవసాయ శాఖ వారు రూపొందించిన బోర్డు యందు అప్డేట్ చెయ్యాలని, స్టాక్ మరియు ధరల పట్టికను రోజు అప్డేట్ చేయాలని, ఎరువులను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రాయించారదనీ ప్రభుత్వ అనుమతి పొందిన ఎరువులను మాత్రమే విక్రయంచాలని, అవసరమైన అన్ని ధృవ పత్రాలు దుకాణం దారులు సరిగా నిర్వహించాలని లేనిచో ఎఫ్ సి ఓ 1985 చట్టం ప్రకారం దుకాణాల పై చట్టపరమైన చర్యలు తీసుకోబడునని హెచ్చరించడం జరిగినది.

# రేషన్ కార్డ్ దారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి.

**నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 08:** జిల్లా కలెక్టర్ నంద్యాల జిల్లా వారు నంద్యాల జిల్లాలోని యావన్మంది రేషన్ ప్రజా పంపిణీ వ్యవస్థ లోని రేషన్ కార్డ్ దారులకు తెలియజేయడం ఏమనగా , జిల్లాలో తెల్ల రేషన్ కార్డ్ పొందిన లబ్ధిదారులు ఈ-కేవైసీ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శుక్రవారం ప్రకటన విడుదల చేయడం జరిగినది. జిల్లాలో మొత్తము 16,21,337 మంది యూనిట్స్ (సభ్యులు ) ఇప్పటివరకు 15,65,916 మంది మత్రమే ఈ-కేవైసీ చేసుకోవడం జరిగింది. ఇంకా 27,820 మంది ఈ-కేవైసీ చేసుకోలేదు. కావున ఈ-కేవైసీ చేసుకొని కార్డ్ దారులు అందరూ వెంటనే మీ సమీపం లోని రేషన్ దుకాణం లేదా గ్రామ, వార్డు సచివాలయం కు వెళ్ళి మీ వేలి ముద్రలు వేసి ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన లో సూచించారు .
రేషన్ ప్రజా పంపిణీ వ్యవస్థ లో పారదర్శకత కొరకు



ప్రతి లబ్ధి దారుడు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి అని తెలియజేయడం అయినది . ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి, రేషన్ పంపిణీ లో అక్రమాలను పూర్తి గా అరికట్టడానికి రేషన్ కార్డ్ లో వున్న ప్రతి సభ్యుడు తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. బయో మెట్రిక్ వేలి ముద్రలు లేదా ఇరిస్ (కంటిపాప ) గుర్తింపు ద్వారా కార్డ్ లోని సభ్యుల వివరాలను ధృవీకరించడం జరుగుతుందని, తద్వారా లబ్ధిదారులకు , ప్రభుత్వానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. ఈ-కేవైసీ వలన కలిగే కీలక ప్రయోజనాలు ఉన్నాయి. గతం లో మరణించిన వారు లేదా గ్రామం లో లేని వారి పేర్ల మీద రేషన్ తీసుకొనే అవకాశం ఉండేదని , కావున ఈ-కేవైసీ ద్వారా అటువంటి నకిలీ లబ్ధిదారులను గుర్తించి తొలగించడం సులభ మవుతుంది అని అన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడానికి వీలుగా ప్రతి లబ్ధి దారుడు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి అని తెలియజేయడం అయినది. నంద్యాల జిల్లా లో ఇంకా 27,820 మంది ఈ-కేవైసీ చేసుకోలేదు, కావున -కేవైసీ చేసుకొని కార్డ్ దారులు అందరూ వెంటనే మీ సమీపం లోని రేషన్ దుకాణం లేదా గ్రామ, వార్డు సచివాలయం కు వెళ్ళి మీ వేలి ముద్రలు వేసి ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన లో సూచించారు . ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయని పక్షం లో భవిష్యత్ లో రేషన్ సరుకులు ,ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు నిలిచి పోయే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన లో స్పష్టం చేశారు.

# టీవీకే విజయం వెనుక జగన్ ఫొటో ఉందనే ప్రచారంపై సత్యకుమార్ విమర్శలు

**అమరావతి,మే 8ఆంధ్ర ప్రగతి**
తమిళనాడు రాజకీయ పరిణామాలపై ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గవర్నర్ వ్యవస్థపై స్పందించారు.




తమిళనాడులో టీవీకే అధినేత విజయ్‌ని ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించే విషయంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అనుసరిస్తున్న తీరుపై వస్తున్న విమర్శలను మంత్రి తిప్పికొట్టారు. గవర్నర్ విజయ్‌ని ఇబ్బంది పెడుతున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని, ఆయన పూర్తిగా రాజ్యాంగ నిబంధనలకు లోబడే నిర్ణయాలు తీసుకుంటారని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తులు నిబంధనల ప్రకారమే నడుచుకుంటారని ఆయన పునరుద్ఘాటించారు.
తమిళనాడు ఎన్నికల్లో విజయ్ సాధించిన విజయం వెనుక జగన్ ఫొటో ఉందంటూ వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న ప్రచారాన్ని మంత్రి హాస్యాస్పదంగా అభివర్ణించారు. సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ప్రజలే జగన్ పాలనను తిరస్కరించి 11 సీట్లకు పరిమితం చేశారని, అలాంటిది పొరుగు రాష్ట్రంలో ఆయన ప్రభావం ఉంటుందనుకోవడం భ్రమ అని ఎద్దేవా చేశారు. "బోర్డర్ దాటితే జగన్‌ను ఎవరైనా గుర్తుపడతారా?" అంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.
తమిళనాడు ఎన్నికల్లో మాజీ మంత్రి రోజా డీఎంకే తరఫున ప్రచారం చేసిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆమె ఎక్కడ ప్రచారం చేస్తే అక్కడ ఓటమి ఖాయమని, డీఎంకే పరాజయం పాలవ్వడమే దీనికి నిదర్శనమని విమర్శించారు. ఏపీలో ప్రజలు బుద్ధి చెప్పినా వైసీపీ నేతలు ఇంకా తమ తీరు మార్చుకోలేదని ఆయన మండిపడ్డారు.

# రాత్రి వేళల్లో విజిబుల్ పోలీసింగ్ కట్టుదిట్టం.

**..నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు. -ఏటీఎం కేంద్రాల వద్ద గట్టి నిఘా.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు జిల్లా క్రైమ్ మే 08:**
జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు.
ఈ కార్యక్రమం ద్వారా నేరాల నియంత్రణతో పాటు అనుమానాస్పద వాహనాల తనిఖీలు చేపడుతున్నారు.
గురువారం రాత్రి నుండి తెల్లవారు జాము వరకు కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్ లలో విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. కర్నూల్ పట్టణంలో కర్నూల్ తాలూకా సిఐ తేజామూర్తి ఆధ్వర్యంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు.
బ్లూ కోల్ట్స్ బృందాలు మరియు క్యూఆర్టీ పోలీసు





బృందాలు పాల్గొని కట్టుదిట్టంగా విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు.అనుమానితుల వేలిముద్రలను సేకరించారు. డ్రంక్ & డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఏటీఎం కేంద్రాల వద్ద పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 112 కు లేదా డయల్ 100కు గాని సమాచారం ఇవ్వాలని సూచించారు.

# వెంకట్రామిరెడ్డి ఉద్యోగ తొలగింపు కేసు..

## ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**అమరావతి,మే 8ఆంధ్ర ప్రగతి**
ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కె. వెంకట్రామిరెడ్డి తనను సర్వీసు నుంచి తొలగించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ నిర్ణయంపై న్యాయపోరాటం చేస్తానని గతంలో ప్రకటించిన ఆయన, అన్నంత పనీ చేశారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.ఈ మేరకు సాధారణ



పరిపాలన, పంచాయతీరాజ్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో పాటు విచారణాధికారిగా వ్యవహరించిన కడప జిల్లా కలెక్టర్‌కు కూడా నోటీసులు పంపింది. తదుపరి విచారణను జూన్ నెలకు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ డి. రమేశ్ తెలిపారు. తనను ఉద్యోగం నుంచి తొలగిస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని వెంకట్రామిరెడ్డి తన పిటిషన్‌లో కోరారు.
**వివాదం నేపథ్యం ఇదే..:**2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో వెంకట్రామిరెడ్డి సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించి, వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేశారని తీవ్ర ఆరోపణలు వచ్చాయి. మార్చి 31న కడప జిల్లాలోని పలు పీటీడీ (ప్రజా రవాణా శాఖ) డిపోల్లో ఆయన రాజకీయ ప్రచారం నిర్వహించారని టీడీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ప్రభుత్వ ఉద్యోగిగా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడంపై ఈసీ సీరియస్‌గా స్పందించింది.
ఈ ఫిర్యాదుపై స్పందించిన కడప జిల్లా కలెక్టర్, ఆయనపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు. దీంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేసింది. అనంతరం ఆయన ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో, కడప కలెక్టర్‌నే విచారణాధికారిగా నియమించింది. సుదీర్ఘ విచారణ జరిపిన కలెక్టర్, వెంకట్రామిరెడ్డి నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారిస్తూ 2025 ఏప్రిల్‌లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక ఆధారంగా ఏపీపీఎస్సీ అనుమతితో ఈ ఏడాది ఏప్రిల్ 20న ఆయన్ను సర్వీసు నుంచి శాశ్వతంగా తొలగిస్తూ (డిస్మిస్) ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులనే ఆయన ఇప్పుడు హైకోర్టులో సవాల్ చేశారు.

# మహిళల భద్రత లక్ష్యంగా శక్తి యాప్ ఏర్పాటు.

**పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో జూపాడుబంగ్లా గ్రామం నందు శక్తి ఆపై అవగాహన సదస్సు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ మే 08:**
నంద్యాల జిల్లా వ్యాప్తంగా మహిళలు రక్షణ కోసం ఏర్పాటు చేసిన శక్తి యాప్ మరియు సైబర్ క్రైమ్ రోడ్డు ప్రమాదాలు ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాలపై ఉశ్రు తంగా అవగాహన కల్పించాలన్న జిల్లా ఎస్పి సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు, ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ సూచనలతో నందికొట్కూరు సబ్ ఇన్స్పెక్టర్, నందికొట్కూరు రూరల్ సిఐ, డిప్యూటీ తాసిల్దార్, ఏపిఎం, ఎంపీపీ మరియు మహిళా సంఘం సభ్యులతో కలిసి, జూపాడుబంగ్లా గ్రామంలో 'శక్తి యాప్' పై ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాము.ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ మహిళల భద్రత మరియు రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'శక్తి యాప్' గురించి అవగాహన కలిగి ఉండాలని,అలాగే శక్తి యాప్ హెల్ప్‌లైన్ నంబర్ 7993485111 గురించి ప్రయోజనాల గురించి ప్రజలకు క్షుణ్ణంగా తెలియజేయడం జరిగింది. బాల్యవివాహాల గురించి వాటి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం జరిగింది. పిల్లలపై జరిగే ఏవైనా నేరాలను 'చైల్డ్ హెల్ప్‌లైన్ 1098' కు తెలియజేయాలని ప్రజలకు





సూచించాము.అంతేకాకుండా, మహిళల రక్షణ కోసం రూపొందించిన ఫోక్సో చట్టాలు, కొత్త చట్టాలు, ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.
చట్టాల ద్వారా మహిళలకు లభించే ప్రయోజనాల గురించి వివరించి అత్యవసర పరిస్థితుల్లో 112 మరియు 100 అనే అత్యవసర నంబర్లను సంప్రదించాలని ప్రజలకు సూచించాము. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు మొదలగు వాటిపై అవగాహన కల్పించాము. ఏదైనా సైబర్ మోసం జరిగినప్పుడు 'సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930' ను సంప్రదించాలని ప్రజలకు తెలియజేశాము. అనుమానాస్పద ఐ వి ఆర్ యస్ కాల్స్, తెలియని లింకులు లేదా మోసపూరిత వాట్సప్ సందేశాలను తెరవవద్దని వారిని హెచ్చరించాము; ఇటువంటి మార్గాల ద్వారా జరిగే ఆర్థిక మోసాల గురించి కూడా అవగాహన కల్పించాము.మరియు, 'వన్ స్టాప్ సెంటర్' యొక్క ప్రాముఖ్యతను మరియు అది అందించే సేవలను వివరంగా వివరించాము. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరినీ తమ మొబైల్ ఫోన్లలో 'శక్తి యాప్' ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని ప్రోత్సహించాము, అలాగే అత్యవసర పరిస్థితుల్లో ఆ యాప్‌ను సమర్థవంతంగా ఎలా ఉపయోగించాలో వారికి నేర్పించాము.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# జోసెఫ్ విజయ్ "విజయం" వెనుక ఓ చాణక్యుడు..!



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 08:**
మంచి చెబుదామని వెళ్లిన చాణక్యుడిని ధన నందుడు పట్టించుకోడు. అతని కొడుకులు ఘోరంగా అవమానించి గెంటేస్తారు. చంద్రగుప్తుడిని నందులకు ప్రత్యామ్నాయంగా తయారుచేసి... నంద రాజ్యాన్ని నాశనం చేసి, మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించాడు చాణక్యుడు. ఇది చరిత్ర.

తమిళనాడు ఎన్నికల్లో విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం (టివికె) విజయం వెనుక కూడా ఇలాంటి చాణక్యుడు ఒకరుఉన్నారు. అతని పేరు కుల్లంపాలయం అర్థనరి సెంగొట్టాయన్ (కె.ఎ.సెంగొట్టాయన్, 80 ఏళ్లు). ఎంజిఆర్ టైములో ఆర్.ఎం.వీరప్పన్ ఎలాగో... జయలలిత కాలంలో సెంగొట్టాయన్ అలాగ! గొప్ప ఆర్గనైజర్. పార్టీ అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాల్లో దిట్ట.

ఎం.జి.రామచంద్రన్‌కి సెంగొట్టాయన్ వీర భక్తుడు. 1972లో అన్నా డిఎంకె ఆవిర్భావం నుంచి 2026 అసెంబ్లీ ఎన్నికలకు ఆర్నెల్ల ముందు బయటికి వచ్చేసే వరకు ఆ పార్టీకే అంకితమయ్యారు. అన్నాడిఎంకె టాప్--5లో ఒకరుగా చక్రం తిప్పారు.

మొత్తంగా 11 సార్లు అసెంబ్లీకి పోటీ చేస్తే... ఒకే ఒక్కసారి ఓటమి పాలయ్యారు. సత్య మంగళం నుంచి ఒకసారి, గోబిచెట్టియపాలయం నుంచి తొమ్మిది సార్లు అంటే పదిసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

సెంగొట్టాయన్‌తో పాటు అన్నాడిఎంకెలో మొదట ఎం.జి.రామచంద్రన్‌కి, తర్వాత జయలలితకు అండగా మరో ఇద్దరు (ఎస్.తిరునావుక్కరసర్, కె.కె.ఎస్.ఎస్.ఆర్.రామచంద్రన్) దన్నుగా నిలబడినా, సెంగొట్టాయన్ ఒక్కరే తుదికంటా కొనసాగారు. ఎంజిఆర్ కేబినెట్‌లో సెంగొట్టాయన్ ఉన్నారని అంటారుగానీ, ఆ వివరాలేవీ దొరకలేదు. ఎంజిఆర్ అనంతరం జయలలిత ఎదుర్కొన్న ప్రతి సంక్షోభంలోనూ సెంగొట్టాయన్ కోటలా అడ్డు నిలిచారు. పార్టీకి కార్యాలయ కార్యదర్శిగా పనిచేశారు. మెంబర్ సెక్రటరీలాంటి పదవి అది. జయ మంత్రివర్గంలో... రెవెన్యూ, వ్యవసాయం, రవాణా వంటి కీలక శాఖలు నిర్వహించారు.

జయలలిత సంగతి తెలియనిదేముంది. ఆమెకు అనుగ్రహమైనా, ఆగ్రహమైనా కొండంత.! శశికళ పెత్తనం పెరిగాక సెంగొట్టాయన్‌ని దూరం పెట్టారు. కేబినెట్ నుంచి తప్పించేశారు. ఒక దశలో పార్టీ వ్యవహారాల్లోకూడా లేకుండా నెట్టేశారు. తిరునావుక్కరసర్, కె.కె.ఎస్.ఎస్.ఆర్.రామచంద్రన్ ఇతర పార్టీల్లో చేరిపోయినా అన్నాడిఎంకెని వదల్లేదు సెంగొట్టాయన్.!

జయ మరణంతో మరింత గడ్డుకాలం ఎదురైంది. ఎడపాడి పళనిస్వామి సిఎం అయ్యాక సెంగొట్టాయన్కి ప్రాథమిక విద్య, యువజన సర్వీసులు లాంటి నాన్--ఫోకల్ మినిస్ట్రీలు ఇచ్చారు.

.2026 ఎన్నికలనాటికి అన్నాడిఎంకె చీలికలన్నింటినీ ఒకటి చేసి... అఖండ అన్నాడిఎంకెతో బరిలో దిగాలన్నది సెంగొట్టాయన్ వ్యూహం.

పళనిస్వామికి నెత్తీనోరు కొట్టుకుని చెప్పారు. ఢిల్లీ వెళ్లి బిజెపి అగ్ర నాయకత్వంతో పలు మంతనాలు కూడా జరిపారు.

తమిళనాడు దక్షిణ జిల్లాల్లో చాలా ప్రభావవంతమైన తేవర్ కమ్యూనిటీని ఒకటి చేయడానికి ప్రయత్నించారు. పసుంపన్ ముత్తురామలింగ తేవర్ (పి.ఎం.తేవర్) జయంతినాడు పన్నీర్ సెల్వం, శశికళ వర్గాలతో భుజం భుజం రాసుకు తిరిగారు.

సెంగొట్టాయన్ మాట వినలేదు సరికదా, పార్టీ నుంచి గెంటేశారు పళనిస్వామి.

అన్నాడిఎంకె ఆవిర్భావం నుంచి ఉన్నందున పళనిస్వామి చర్యను ఘోర అవమానంగా భావించారు సెంగొట్టాయన్. అటు నుంచి అటే మరో ఆలోచన లేకుండా సినీ నటుడు విజయ్‌ని కలిశారు.

పశ్చిమ తమిళనాడు జిల్లాల్లో కొంగు వెల్లలార్ గౌండర్ కమ్యూనిటీ చాలా బలమైంది. అదే వర్గానికి చెందినవారు సెంగొట్టాయన్.

అనుకోని వరంలా విజయ్ టక్కున అందిపుచ్చుకున్నారు, తమిళగ వెట్రి కళగం (టివికె) అత్యున్నతస్థాయి కమిటీకి చీఫ్ కో--ఆర్డినేటర్‌గా నియమించారు.

పార్టీ అంతర్గత వ్యవహారాల దిద్దుబాటులోనూ, ఢిల్లీ స్థాయి పరిచయాల్లోనూ, ప్రభుత్వ పాలనలోనూ సుదీర్ఘ అనుభవంగల సెంగొట్టాయన్... మరో చాణక్యుడిలా తమిళనాట ద్రవిడ సిద్ధాంత ట్యాగ్‌తో పనిచేసే పార్టీల్ని మట్టి కరిపించారు.

పశ్చిమ తమిళనాడు జిల్లాల్లో 60 శాతం స్ట్రయిక్ రేటుతో టివికెని గెలిపించారు.

ఒకటి రెండు రోజులు ఆలస్యమైనా... తమిళనాడుకి కాబోయే ముఖ్యమంత్రి టివికె అధినేత విజయ్‌నే! అతని మంత్రివర్గంలో ఆర్థిక శాఖ సెంగొట్టాయన్‌కే దక్కుతుందని బాగా వినిపిస్తోంది.

## రాయలసీమ కాదు...రాయల్ సీమ

### రాయల్ ఎన్‌ఫీల్డ్ రాకపై ఎక్స్‌లో బాబు పోస్ట్

**అమరావతి,మే 8ఆంధ్ర ప్రగతి**




ఏపీకి ప్రపంచ ప్రఖ్యాత ఐకానిక్ మోటార్ సైకిల్ బ్రాండ్ 'రాయల్ ఎన్‌ఫీల్డ్' రాబోతోంది. తిరుపతిలో రూ. 2,500 కోట్లతో మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఏపీకి రాయల్ ఎన్‌ఫీల్డ్ రాకపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'రాయలసీమ ఇప్పుడు రాయల్‌సీమ' అనే టైటిల్‌తో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ఉన్న ఫొటోను సీఎం చంద్రబాబు షేర్ చేశారు. ఈ ఫొటోకి 'రాయలసీమకు దూసుకువస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్' అంటూ క్యాప్షన్ పెట్టారు. రెండు రోజుల క్రితం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ).. రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ పరిశ్రమకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్ట్ కోసం సత్యవేడు పరిధిలోని వన్నెలూరు, రాళ్లకుప్పం గ్రామాల్లో సుమారు 267 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఈ పరిశ్రమ ద్వారా సుమారు 5,000 మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గురువారం జరిగిన కలెక్టర్ల సమావేశంలోనూ ఏపీకి రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ రావడంపై సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. కాలేజీ రోజుల్లో బు÷-లలెట్ బండి నడిపిన సంగతులను సీఎం గుర్తుచేసుకున్నారు. 'కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ డ్రైవ్ చేశా.. ఇప్పుడు ఆ సంస్థను ఏపీకి తెచ్చాం' అంటూ ఆనాటి జ్ఞాపకాలను చంద్రబాబు పంచుకున్నారు.

## నేపాలీ గ్యాంగ్‌గా అనుమానం

**పోలీస్ అధికారి భార్య హత్య**
**క్లూ ఆధారంగా వేంగంగా విచారణ**
**నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి**

**హైదరాబాద్,,మే 8ఆంధ్ర ప్రగతి**



జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనుజా (55) హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు మొదటగా సమాచారం వచ్చిందని తెలిపారు. రిటైర్డ్ డీజీ భార్య తనుజాను గురువారం రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పుకొచ్చారు. నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని.. ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేపాలి పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. గురువారం రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ దారుణం చేసిందని తెలిపారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని.. తనుజ గ్రౌండ్ ఫో÷-లోర్‌లో ఉన్నారని వెల్లడించారు. ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని.. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. నేపాలి పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండో ఏడాది పనిచేసిన కూడా వాళ్లపై నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని తెలిపారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని చెప్పారు. రిటైర్డ్ డీజీ తల్లి కోసం ఆమె హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీ తల్లి మరణించారని.. అప్పటి నుంచి తనుజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు. ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే అంశాలపై ఆరా తీస్తున్నామని తెలిపారు. నిందితులు బ్యాక్ గేట్ నుంచి ఇంట్లోకి ప్రవేశించారని.. ఘటన అనంతరం వెనుక నుంచి పారిపోయారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.
----

## అమెరికా, ఇరాన్ యుద్ధం... చమురు కంపెనీలకు రూ.30 వేల కోట్ల నష్టం

**యుద్ధానికి ముందు 70 డాలర్లుగా ఒక బ్యారెల్ ముడి చమురు ధర**
**ఇప్పుడు 100 డాలర్లు పలుకుతున్న వైనం**
**అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పటికీ భారత్‌లో మాత్రం స్థిరంగా ధరలు**



అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరుగుతున్నాయి. అయితే మన దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు యథాతథంగా ఉన్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ముడిసరుకు ధర ఒక దశలో యాభై శాతం పెరిగింది. కానీ మన వద్ద చమురు కంపెనీలు ధరలను స్థిరంగా కొనసాగించాయి. దీంతో చమురు కంపెనీలకు రూ.30 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ఒక బ్యారెల్ ముడి చమురు ధర 70 డాలర్ల వద్ద ఉండగా, ప్రస్తుతం 100 డాలర్లకు పైగా పలుకుతోంది. ఒక దశలో 144 డాలర్లకు కూడా చేరుకుంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఇంధన సరఫరాను నిరంతరాయంగా కొనసాగించాయి.అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పటికీ, దేశీయ చముర రంగ సంస్థలు పెంచకపోవడంతో ఈ మూడు కంపెనీలు రూ.30 వేల కోట్ల నష్టాన్ని చవిచూశాయి. కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్‌పై లీటర్‌కు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. దీంతో నష్టాలు రూ.62,500 కోట్ల నుంచి రూ.30 వేల కోట్లకు తగ్గాయి.అంతర్జాతీయంగా పెరిగిన ముడి చమురు ధరకు అదనంగా మరికొన్ని ఖర్చులను భరించాల్సి వచ్చింది. రవాణా నౌకలను దారి మళ్లించడం, బీమా ప్రీమియాలు పెరగడం వంటి ఖర్చులు జత కలిశాయి.

## ఏపీలో కొనసాగుతున్న భిన్నమైన వాతావరణ పరిస్థితులు

**ఓవైపు వానలు.. మరోవైపు వడగాల్పులు**

**అమరావతి,మే 8ఆంధ్ర ప్రగతి**

ఏపీలో వాతావరణం విభిన్న రీతుల్లో కొనసాగుతోంది. ఒకవైపు వర్షాలు ప్రజలకు ఉపశమనం కలిగిస్తుండగా, మరోవైపు తీవ్రమైన ఎండలు, ఉక్కపోత, వడగాల్పులతో జనం అల్లాడిపోతున్నారు. ఈ భిన్నమైన పరిస్థితులు రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ట్రోపో ఆవరణంలోని గాలుల ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, చిత్తూరు, తిరుపతి, కడప, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడొచ్చని అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపుల సమయంలో ప్రజలు, రైతులు, పశువుల కాపర్లు చెట్ల కింద, పొలాల్లో ఉండరాదని, సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు.

గత రెండు రోజులుగా పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు బీభత్సం సృష్టించాయి. భారీ గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కృష్ణా జిల్లా కోడూరు మండలంలో మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి రోడ్లు, కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులు నీట మునిగాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే, వారం రోజులుగా ఎండ వేడిమితో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షాలు కాస్త ఊరటనిచ్చాయి. వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు.

**కొనసాగుతున్న వడగాల్పులు**

వర్షాలు కురవని ప్రాంతాల్లో మాత్రం ఎండల తీవ్రత కొనసాగుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జికె వీధి, ముంచింగిపుట్టు, పెదబయలు, గోకవరం, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, గుర్తేడు మండలాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. గురువారం పోలవరం జిల్లా వీఆర్ పురంలో అత్యధికంగా 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, అల్లూరి జిల్లా గంపరైలో 21.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ విభిన్న వాతావరణ పరిస్థితుల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్

**ఏపీ ఈసెట్ 2026 ఫలితాలు విడుదల**
**మొత్తం 91.72 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత**
**ఫలితాలను 'ఎక్స్' వేదికగా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్**
**అధికారిక వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్‌లోనూ ర్యాంకు కార్డుల వెల్లడి**
**బీటెక్ సెకండియర్‌లోకి లేటరల్ ఎంట్రీ కోసం ఈ పరీక్ష**

**మే 8ఆంధ్ర ప్రగతి**



ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్-2026) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఈ ఫలితాలను 'ఎక్స్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ పరీక్షలో మొత్తం 91.72 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు ఆయన వెల్లడించారు.

ఈ ఏడాది ఏప్రిల్ 23న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 32,434 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 29,750 మంది అర్హత సాధించారు. ఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులందరికీ మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా బీటెక్, బీఈ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు (లేటరల్ ఎంట్రీ) ఈసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. దీని ద్వారా విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని ఆదా చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ జరుగుతుంది.

ఫలితాలు, ర్యాంకు కార్డులను విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ cets.apsche.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీంతో పాటు, విద్యార్థులకు మరింత సౌలభ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ఈసారి వాట్సాప్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. తమ ఫోన్‌లోని వాట్సాప్ నుంచి 9552300009 నంబర్‌కు సందేశం పంపి కూడా ర్యాంకు కార్డును సులభంగా పొందవచ్చు.

ఫలితాల విడుదల ప్రక్రియ పూర్తవడంతో, త్వరలోనే అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి విడుదల చేయనుంది. విద్యార్థులు తదుపరి ప్రకటనల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.